క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

కైకలూరు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద నూతనంగా నియమితులైన జిల్లా అనుబంధ విభాగ కమిటీల సభ్యులు డీఎన్నార్‌ను కలిసి ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో బీసీ విభాగ ఉపాధ్యక్షులుగా బత్తిన కిషోర్, పంచాయతీరాజ్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా శీలం రామకృష్ణ, యువజన విభాగ ఉపాధ్యక్షులుగా రామిశెట్టి అభిలాష్, ఇంటెలెక్చువల్ ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్ మర్రివాడ సుధాకర్‌రెడ్డి, వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పాండురంగారావు, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి పేర్ని పృథ్వీ ఉన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి, ముదినేపల్లి మండలం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశం వాయిదా

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరగాల్సి ఉందని, కొన్ని కారణాలతో మంగళవారానికి వాయిదా వేశామని ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం తెలిపారు. 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో జరిగే సమావేశానికి వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: మండలంలోని పెంజెంద్రలో బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, విజ్ఞాన్ జ్యోతి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ చీఫ్ పాట్రోన్ బొప్పన తారాచంద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాంతాల నుంచి ఈ మెగా వైద్య శిబిరానికి రోగులకు ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన వారికి వీల్‌చైర్స్, యంత్ర పరికరాల ద్వారా కళ్ల అద్దాల మార్పిడి చేసి అందించటం, సమస్య తీవ్రతను సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్స్‌కు సిఫార్సు చేయటం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. అవసరమైన రోగులకు ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడరూరల్: అనుకోని కొన్ని సంఘటన వల్ల దురుసుగా ప్రవర్తించి, వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వన్‌టౌన్ స్టేషన్ వద్ద ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆర్.గంగాధర రావు ఆదేశాల మేరకు డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రత పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రౌడీషీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

రైతుల అభ్యున్నతికి బ్యాంకులు పని చేయాలి

గుడ్లవల్లేరు: రైతుల అభ్యున్నతికి బ్యాంకులు పని చేయాలని గుడివాడ బ్యాంకు ఉద్యోగుల సంఘ సెక్రటరీ సీహెచ్.అభయ ఆంజనేయస్వామి పేర్కొన్నారు. బ్యాంకులను జాతీయం చేసి 56ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గుడివాడ బ్యాంకు ఉద్యోగుల సంఘం తరపున ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా గ్రామణ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో బ్యాంకుల సేవలు అందడం లేదన్నారు. వివిధ బ్యాంకులకు సంబంధించిన శాఖలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించి సేవలు అందించాలని కోరారు. .

ఘనంగా ఆడి కృత్తిక మహోత్సవం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడి కృత్తిక కావడి బిందెల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని తమిళనాడు పళని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మాత్రమే నిర్వహిస్తారు. ఇందుకనుగుణంగా ఇక్కడ పళని సంప్రదాయ ప్రకారం కావడి బిందెల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకి సేవ, కావడి బిందెల ఉత్సవంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఉత్సవంలో పాల్గొని పల్లకిసేవ నిర్వహించారు. భక్తజన సందోహంతో సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్ కిక్కిరిసిపోయింది. జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా కావడి సేవ అనంతరం మాస కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదికపై ఉంచి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు.

సమస్యలతో కృష్ణాపురం సతమతం

- ఇరుకు గదిలో సచివాలయం
- అధ్వానంగా రహదారులు

పమిడిముక్కల: కృష్ణాపురం గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. నాలుగు రోడ్ల కూడలి. సచివాలయ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇరుకు గదిలో సచివాలయం కొనసాగుతుంది. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గ్రామంలో నాలుగువేల మంది జనాభా ఉన్నారు. 12 వార్డులు ఉన్నాయి. తొమ్మిది శివారు గ్రామాలు ఉన్నాయి.

అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం

గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత కొంత కాలంగా సచివాలయాన్ని పీఏసీఎస్ గోడౌన్‌లో నిర్వహిస్తున్నారు. ఒకే ఇరుకు గదిలో కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, మహిళా పోలీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకరు కూర్చొంటే మరొకరు నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ పనులు మీద సచివాలయానికి వచ్చిన వారి బాధలు వర్ణనాతీతం. పక్కనే ఎరువుల గోడౌన్ ఉండటం, దుర్వాసన వస్తుండటంతో అక్కడ ఉండలేని పరిస్థితి నెలకొంది. సచివాలయ భవనం పూర్తయ్యే వరకు అద్దె భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఇరుకు గదిలో కొనసాగుతున్న సచివాలయం



కృష్ణాపురం సెంటర్‌లో అధ్వానంగా మారిన రహదారి

గుంతలమయంగా రహదారులు

కృష్ణాపురం గ్రామం నాలుగురోడ్ల కూడలి. కృష్ణాపురం-ఐలూరు, కృష్ణాపురం-చోరగుడి, కృష్ణాపురం- కూచిపూడి, కృష్ణాపురం- పమిడిముక్కల రోడ్లు గుంతలమయంగా మారాయి. వర్షం వస్తే గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. కృష్ణాపురం వాసులు గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

శివారు గ్రామాల్లో సమస్యల మోత

కృష్ణాపురం గ్రామానికి గౌడపాలెం, కొత్త దళితవాడ, పాత దళితవాడ, మసలనాయికపాలెం, నారాయణపురం, రాజారావుపేట, తెల్లాకులపాలెం, దేశన్నపాలెం, మగ్గాలమాలపల్లి శివారు గ్రామాలుగా ఉన్నాయి. గౌడపాలెం, పాత దళితవాడ, ముసలనాయికపాలెం, మగ్గాలమాలపల్లి గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం వస్తే ఈ గ్రామాల్లో నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోకి ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. కృష్ణాపురం సెంటర్‌లోని నాలుగురోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. గుంతల్లో నీరు చేరి చెరువులా మారాయి. పనులమీద పమిడిముక్కల, కూచిపూడి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఇసుక టిప్పర్లు రోడ్లను ధ్వంసం చేశాయి. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా సచివాలయ భవనం



గౌడపాలెం రోడ్డు దుస్థితి

గౌడపాలెం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



వర్షం పడితే రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. గ్రామం నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. రహదారి సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.

– కాగిత రామ్మోహనరావు, గౌడపాలెం

మగ్గానమాలపల్లి రోడ్డును బాగుచేయండి



గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. రహదారి సమస్యను పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

– పొనుగుమాటి వెంకటేశ్వరరావు, మగ్గానమాలపల్లి

ఇరుకు గదిలో సచివాలయం

సచివాలయం ఇరుకు గదిలో కొనసాగుతోంది. దీంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పంచాయతీ నిధులు రూ.5 లక్షలు కేటాయించి అసంపూర్తి భవనంలో కొంత భాగాన్ని బాగుచేసి సచివాలయాన్ని అందులోకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం.

– వీరంకి బలుసలమ్మ, సర్పంచ్, కృష్ణాపురం

రేపు విద్యుత్ వినియోగదారులకు అవగాహన

గుడ్లవల్లేరు: కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం (సి.జి.ఆర్.ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరరావు ఆదివారం తెలిపారు. హనుమాన్ జంక్షన్‌లోని ఎస్.ఆర్ కన్వెన్షన్ హాల్(రాయల్ హంపి) విజయవాడ రోడ్డులో జరిగే ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమములో సి.జి.ఆర్.ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మాన్యుయేల్, ఫార్మర్ డిస్ట్రిక్ట్ - సెషన్స్ జడ్జి, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజినీర్, మచిలీపట్నం, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నీట మునిగిన వరి పొలాలు



మొవ్వ: వరి నాట్లు అధికశాతం పూర్తయిన తరువాత కాలువల్లో ఒక్కసారిగా నీరు రావటంతో పాటు రెండు రోజులుగా భారీ వర్షాలు కురవటంతో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అయ్యంకి, కారకంపాడు, చినముత్తేవి, అవురుపూడి, నిడుమోలు తదితర గ్రామాల్లో ఆదివారం వరి పొలాలు నీటమునిగి దర్శనమిచ్చాయి. మునిగిన పొలాల్లోని నీటిని దిగువ ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రులో శ్రీ గంగానమ్మ బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణా రాష్ట్రంలో బోనాల జాతర జరిగే విధంగా గ్రామంలో సుమారు 200 మంది మహిళలు నెత్తిపై బోనాలు పెట్టుకుని గ్రామంలోని అన్ని విధుల్లో తిరిగారు. గ్రామంలోని మహిళలే కాకుండా ఏలూరు, చింతలపూడి, హైదరబాద్, విజయవాడ నుంచి మహిళలు వచ్చి బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి, మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ శివయ్య దంపతులు గంగానమ్మ తల్లికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, జాలభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఏడేళ్ల నుంచి గ్రామంలో గంగానమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో బోనాల జాతర నిర్వహించటంతో చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామోత్సం అనంతరం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



మోపర్రులో గంగానమ్మకు బోనాలు తీసుకొస్తున్న భక్తులు, కమిటీ చైర్మన్ శివయ్య

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టండి

గుడివాడరూరల్: మండలంలోని గుంటాకోడూరు పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అయ్యాయని, దీనిపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన అంగడాల శివకుమార్, మేకల రామాంజనేయులు, మెరుగుమాల వీరాంజనేయులు విలేకరులతో మాట్లాడారు. పంచాయతీకి వచ్చిన 15వ ఆర్థిక సంఘ నిధులు దుర్వినియోగం అయ్యాయని తెలిపారు. గ్రామంలో ఉన్న పంచాయతీ మంచినీటి చెరువుకి మంచినీళ్లు పెట్టుకునేందుకు అవసరమైన విద్యుత్‌ను గ్రామానికి చెందిన రైతు ఉచితంగా ఇవ్వగా పంచాయతీ సర్పంచ్ మాత్రం పంచాయతీ నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపి రూ.లక్షకు పైగా స్వాహా చేశారన్నారు. 2024–25 సంవత్సరానికి గ్రామంలో రూ.2లక్షలకు పైగా బ్లీచింగ్, ఫాగింగ్, ఇతరత్రాలకు వాడినట్లు రికార్డుల్లో చూపించి సొంతానికి వాడుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. వర్షాకాలం వచ్చినా ఇంత వరకు గ్రామంలో బ్లీచింగ్, దోమల పిచికారీ మందు నుగారీ ఉపయోగించలేదన్నారు. ఈ విషయం అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినా ఇంత వరకు ఏ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టి నిజాలను వెలికి తీయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీ సభ్యుల నియామకం



కైకలూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కైకలూరు నియోజకవర్గానికి చెందిన ఏలూరు జిల్లా అనుబంధ విభాగాల కమిటీలలో వివిధ హోదాలలో పలువురిని శనివారం నియమించారు. ఈ మేరకు తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి నియమితులైన వారి జాబితా విడుదలైంది. వైఎస్సార్ సీపీ వీవర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా బొంతు నాగభూషణం, సెక్రటరీగా పెనుమాల నాగశిరోమణి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నందం పూర్ణచంద్రరావు, భోగా వెంకటేశ్వరరావును నియమించారు.

- వైఎస్సార్‌టీయూసీ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గోదావరి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీగా పేరే రామకృష్ణ, సెక్రటరీగా తోట మహేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బొమ్మనబోయిన రాజేష్, అంగనవాడీ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ధనికొండ మేరమ్మ, జనరల్ సెక్రెటరీగా చెప్పాల సునీత, సెక్రటరీగా తేరా జ్ఞానవతి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా తమ్మిశెట్టి లక్ష్మీ నియమితులయ్యారు.
- లీగల్ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా జమ్మూ సురేష్, జనరల్ సెక్రటరీగా అడ్డగర్ల శాంతి స్వరూప్ యాదవ్, సెక్రటరీగా బందెల లక్ష్మణరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మేడేపల్లి రవి, కల్చరల్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా కందుల వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా రంగిశెట్టి నరసింహారావు, సెక్రటరీగా శాఖమూరి అమ్మనరాజా, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా చిగురుపాటి ఐజాక్, ఐటీ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నల్లజర్ల పవన్ కళ్యాణ్, జనరల్ సెక్రటరీగా దాసరి సుధాకరరావు, సెక్రెటరీగా చిట్టూరి వాసుకోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మర్రివాడ నవీన్‌రెడ్డి, దేవరకొండ సతీష్, సోషల్ మీడియా కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మణిమాల రాజేష్, జనరల్ సెక్రెటరీగా పేర్ని పృథ్వీ, సెక్రటరీగా గరికిముక్కల అశోక్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా వల్లూరి చైతన్యవర్మను నియమించారు.
- దివ్యాంగుల విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గొంతుపులుగు సుమంత్, జనరల్ సెక్రటరీగా కొడవల్ల శామ్యూల్, సెక్రటరీగా సొర్రా నరసింహస్వామి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పొంగులేటి బాలస్వామి, డాక్టర్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎండీ షబ్బీర్, జనరల్ సెక్రటరీగా సమనపూడి సుధాకర్, సెక్రటరీగా కురేళ్ల ఆరోగ్య జీవరత్నం, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా గుంపుల లాజర్, పబ్లిసిటీ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా దుగ్గిరాల వినోద్, జనరల్ సెక్రెటరీగా బలే వెంకట అశోక్, సెక్రటరీగా బండి ప్రసాదు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గోరింకల గంగరాజు, కన్నా రమేష్, ఆర్టీఐ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పరస శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా చిట్టూరి రాజశేఖర్, సెక్రటరీగా నున్న జాన్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా భాష్యం సత్యనారాయణ, గ్రీవెన్స్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా చల్లగుల్ల శ్రీకాంత్, జనరల్ సెక్రటరీగా కోటే ప్రవీణ్, సెక్రటరీగా బావిశెట్టి స్వామి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మహమ్మద్ షఫావుతుల్లా (చిన బాషా), యాళ్ల కృష్ణను నియమించారు.
- ఇంటిలెక్చువల్ ఫోరం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గుడివాడ మురళి, జనరల్ సెక్రెటరీగా పంజా రామారావు, సెక్రటరీగా సోముల శ్యాంసుందర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మర్రివాడ సుధాకర్ రెడ్డి, పాము రమేష్, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా జొన్నగడ్డ దేవదాస్, జనరల్ సెక్రటరీగా చింతల కిషోర్, సెక్రటరీగా కర్రె డేవిడ్‌రాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ముత్యాల రామచంద్రరావు, జంగాల వెంకటేశ్వర రెడ్డి, బూత్ కమిటీ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మంగినేని బాబ్జి, జనరల్ సెక్రెటరీ పాలపర్తి సద్గుణరావు, సెక్రటరీగా పోతురాజు హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కాశీ సోని, పంజా నాగబాబు నియమితులయ్యారు.

మోసాల బాబుకు గుణపాఠం తప్పదు

పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: అబద్ధపు హామీలు, మోసపు మాటలతో ప్రజలను వంచించి గద్దెనెక్కిన చంద్రబాబుకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని భద్రిరాజుపాలెం కల్యాణ మండపంలో బాబు షూరిటీ-మోసం గ్యారంటీపై మండల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను సూపర్‌గా మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలను అమలు చేయకుండా, ప్రశ్నించిన ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కుట్రపూరిత పాలన సాగిస్తున్నారన్నారు. అమ్మ ఒడి ఇచ్చి పేద పిల్లల చదువులకు బాసటగా నిలిచింది మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అయితే, తల్లికి వందనం లోకేష్ కనిపెట్టాడని చంద్రబాబు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బడుగు,బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలనలో జగనన్న నూతన సంస్కరణలు తీసుకువస్తే, వాటిని చంద్రబాబు కుట్రపూరిత ఆలోచనలతో నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బాబు షూరిటీ-మోసం గ్యారంటీ పేరుతో ప్రజలకు జరిగిన నష్టాన్ని కార్యకర్తలు ఇంటింటికీ వివరించాలని పిలుపునిచ్చారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కైలే అనిల్‌కుమార్ తదితరులు

కార్యకర్తలకు అండగా ఉంటా..

వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అనిల్‌కుమార్ భరోసానిచ్చారు. కూటమి నాయకులు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అవినీతికి హద్దులు లేకుండా పోయాయన్నారు. ఏడాది పాలనలో రూ. వంద కోట్లు దోచుకున్న ఘనత ఆయనదేనని విమర్శించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మోర్ల రామచంద్రరావు, సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ హేమలత, నందేటి గంగాభవాని, యు. ఉదయబాస్కర్, శీలం రమేష్, బి. వెంకటేశ్వరరెడ్డి, ఆరేపల్లి రాము, నిమ్మగడ్డ ప్రభుదాస్, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు, నాయకులు నడకుదురు రాజేంద్ర, కిలారం శ్రీనివాసరావు, మర్రెడ్డి శేషిరెడ్డి, చింతలపూడి గవాస్కర్‌రాజు, ఆరేపల్లి జగన్‌మోహన్‌రావు, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ఆషాఢ సారె

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరం నుంచి ఆ మందిర వ్యవస్థాపకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గంగానమ్మ తల్లికి ఆషాఢ సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి యలమంచిలి లక్ష్మీ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని చిన్నకామనపూడిలో వివిధ ఆలయాల్లో ఆషాఢ సారె సమర్పణ ఆదివారం ఘనంగా జరిగింది. సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో మహిళలు భారీఎత్తున పాల్గొని ఆలయాల్లో సారెలు, చీరెలు, స్వీట్లు సమర్పించి పూజలు నిర్వహించారు. తొలుత స్థానిక రామాలయంలో ప్రారంభించి ఆంజనేయస్వామి, యాదవ శ్రీకృష్ణాలయం, మహంకాళేశ్వరస్వామి, గంగానమ్మ ఆలయాల్లో సారె సమర్పించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక ఏలూరు రోడ్డు కాల్వగట్టున సంతాన నాగేంద్ర స్వామి ఆలయంలో వల్లీ దేవసేన మాతకు మహిళా భక్తులు ఆషాఢ సారెను ఆదివారం సమర్పించారు. ముందుగా గంగానమ్మ, రామాలయంలో సీతమ్మ, కనకదుర్గామాత, గంగా పార్వతీ మాతకు సారెను అందించారు.



గంగానమ్మకు సారె తీసుకెళుతున్న భక్తులు

గుడివాడ సబ్ డివిజన్‌లో 30 యాక్ట్ అమలు

డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: గుడివాడ సబ్ డివిజన్‌లో 30 యాక్ట్ అమలులో ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు ఎలాంటి అనుమతులు లేవని పేర్కొన్నారు. ఒకవేళ ఏదైనా సమావేశాలు, సభలు నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలతో పాటు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.